## పార్లమెంట్ ఎన్నికలపై జిల్లా గ్రీవెన్స్ కమిటీ

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నందున కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల జిల్లా గ్రీవెన్స్ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి, డీఆర్‌డీవో, అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సరైన పత్రాలు, ఆధారాలు లేకుండా రూ.50 వేలకన్నా ఎక్కువ నగదును, అలాగే రూ.10 వేలకన్నా ఎక్కువ విలువైన వస్తు సామగ్రిని తీసుకొని ప్రయాణించవద్దన్నారు. ఒకవేళ ఎక్కువ నగదుతో ప్రయాణించినట్లైతే ఎఫ్ఎస్‌టీ/ఎస్ఎస్‌టీ/పోలీస్ అధికారులు ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేస్తారని పేర్కొన్నారు. సీజ్ చేసిన నగదు విడుదల కోసం సదరు బాధితులు సరైన పత్రాలు, ఆధారాలతో జిల్లా సహకార అధికారి కార్యాలయం, ఎస్-1 బ్లాక్, సెకండ్ ఫ్లోర్, జిల్లా సమీకృత అధికారుల కార్యాలయంలోని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారు పూర్తి పరిశీలన చేసిన తర్వాత అది ఎన్నికలకు సంబంధించిన నగదు కాదని నిర్ధారించిన తర్వాత విడుదల చేస్తారని పేర్కొన్నారు. దీనిపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే 91001 15679 నంబర్‌కు కాల్ చేసి కమిటీ కన్వీనర్‌ను సంప్రదించాలని సూచించారు.

## గోటి తలంబ్రాలకు శ్రీకారం


గోటి తలంబ్రాలు వలుస్తున్న రామ భక్తులు

సారపాక, మార్చి 22 : భద్రాచలంలో ఏప్రిల్‌లో జరిగే రామయ్య పెళ్లి కోసం సారపాకలోని సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మజాగరణ సమితి, ఆంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో వడ్లను గోటితో వలిచే కార్యక్రమానికి రామ భక్తులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ఏటా సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాలను తయారు చేసి భద్రాద్రి రామాలయంలో సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. హోలీ పండుగ రోజు సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయం నుంచి భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి గోటి తలంబ్రాలను ఇరుముడి కట్టుకుని పాదయాత్రగా వెళ్లి స్వామివారి సన్నిధిలో సమర్పించనున్నట్లు తెలిపారు. గోటి తలంబ్రాలను వలవడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు రామభక్తులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు, రామ భక్తులు పాల్గొన్నారు.


గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గర్భిణులకు ఇచ్చిన న్యూట్రిషన్ కిట్లు (ఫైల్)

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గర్భిణులపై శీతకన్ను
- మూడు నెలలుగా నిలిచిన కిట్ల పంపిణీ
- పట్టించుకోని సర్కార్.. పట్టింపు లేని వైద్యాధికారులు
- ఇప్పటికైనా స్పందించాలని లబ్ధిదారుల డిమాండ్

# అటకెక్కిన న్యూట్రిషన్ కిట్

### రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి..



నిరుపేద గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం సాధ్యం కాదు. అది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. మా పరిస్థితిని ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం కిట్లు విడుదల చేయాలి. ఇలాంటి అత్యవసర పథకాలను ప్రభుత్వం నిలిపివేయకూడదు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ప్రభుత్వం స్పందించాలి.

– ఎన్.రోజా, గర్భిణి, చంద్రుగొండ

### నెల చివరికల్లా కిట్లు వస్తాయి..



మూడు నెలలుగా జిల్లాకు న్యూట్రిషన్ కిట్లు రావడం లేదు. ఈ నెలాఖరులోపు కిట్లు అందుతాయి. అందిన వెంటనే గర్భిణులకు కిట్లు అందజేస్తాం. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మందికి కిట్లు అందిస్తాం.

– డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో, భద్రాద్రి జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఒక ప్రాణం కొత్తగా భూమి మీదకు వస్తుందంటే దానికి కారణం అమ్మ. ఆమె నవ మాసాలు మోసి కంటే తప్ప కొత్త తరం ఉండదు. పుట్టుక ఉంటే తప్ప సృష్టి మనుగడ సాధ్యం కాదు. అందుకు గర్భిణిని కాపాడుకోవడం ఎంతో అవసరం. ఆమెకు ఆయురారోగ్యాలు ప్రసాదించడం ఎంతో ముఖ్యం. ఈ ప్రాధాన్యాన్ని గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. గతేడాది అక్టోబర్‌లో పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంపిణీ నిలిచిపోయింది.

**కిట్లలో పంపిణీ ఇలా..**

ప్రతి గర్భిణికి నాలుగో నెలలో ఒకసారి, ఎనిమిదో నెలలో ఒకసారి గత కేసీఆర్ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు అందించేది. అందిన కిట్లను సద్వినియోగం చేసుకొని గర్భిణులు ఆరోగ్యాన్ని కాపాడుకునేవారు. ఒక్కో కిట్‌లో ఒక కిలో ప్రొటీన్ పౌడర్, ఒక కిలో ఖర్జూర, మూడు ఐరన్ సిరప్స్, బెల్లం పల్లీ పట్టీతో ఇతర పదార్థాలు ఉండేవి. పథకం ప్రారంభమైన సమయంలో జిల్లావ్యాప్తంగా 16,300 మంది గర్భిణులకు కిట్లు అందాయి. జిల్లాలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , ఐదు యూపీహెచ్‌సీ, నాలుగు సీఎఫ్‌డబ్ల్యూసీ కేంద్రాలు ఉండగా.. వాటి పరిధిలో 13 నుంచి 27 వారాల గర్భిణులకు మొదటి కిట్, 28 నుంచి 34 వారాల గర్భిణులకు రెండో కిట్ అందింది. నాడు నాలుగో గర్భిణులు ప్రస్తుతం ఎనిమిదో నెలకు చేరుకున్నారు. ప్రస్తుతం వారికి కిట్లు అందాల్సి ఉన్నది. అలాగే కొత్తగా నాలుగో నెల గర్భం ధరించిన వారికి కిట్లు అందాల్సి ఉన్నది. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయే చూపిస్తుంది.


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు గుడ్లు, పాలు అందిస్తున్న డీడబ్ల్యూవో విజేత (ఫైల్)

**అడ్రస్ లేని కిట్లు..**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్కసారైనా న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ఆగలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక పంపిణీ ఆగిపోయింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఎక్కడా కిట్లు అందుబాటులో లేవు. దీంతో గర్భిణులు పోషకాహారం అందక ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వం రాకముందు ప్రతి గర్భిణికి కిట్లు అందాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పైనుంచే సరఫరా ఆగిపోయింది. గర్భిణులు ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత వైద్యాధికారులను న్యూట్రిషన్ కిట్లు అడిగి, లేవు అనిపించుకుని నిరాశతోనే వెనుదిరుగుతున్నారు. కుదిరిన వారు బయట ఎక్కువ ధరకు పోషక విలువలున్న ఆహారం తీసుకుంటున్నారు. కుదరని వారు ఇక మన ఆర్థిక పరిస్థితి ఇంతే అని సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, గర్భిణులకు కిట్లు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కవిత అరెస్టు ముమ్మాటికీ అక్రమమే..

**ఉద్దేశపూర్వకంగానే ఆమెపై తప్పుడు కేసులు బనాయించారు..**

**ఈ కేసులో ఆమె బాధితురాలే తప్ప నిందితురాలు కాదు..**

**ధర్మం గెలుస్తుంది.. న్యాయ వ్యవస్థపై మాకు సంపూర్ణ విశ్వాసముంది..**

**ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు**


ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో ఖమ్మం ఎంపీ నామా

ఖమ్మం, మార్చి 22: ఎమ్మెల్సీ కవిత అరెస్టు ముమ్మాటికే అక్రమమేనని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆమెపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తప్పుడు కేసులు పెట్టిందని అన్నారు. ఈ కేసును టీవీ సీరియల్ మాదిరిగా రెండేళ్లు సాగదీసిందని, ఇప్పుడు ఎన్నికల వేళ దాన్ని తెరపైకి తెచ్చిందని అన్నారు. 2004 నుంచి 2014 వరకు కేవలం 200 కేసులను మాత్రమే నమోదు చేసిన ఈడీ.. 2014 నుంచి ఈ పదేళ్ల కాలంలో ఏకంగా 2,954పైగా కేసులు నమోదు చేసిందని అన్నారు. అసలు ఈ కేసుతో కవితకు ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. ఇందులో ఆమె బాధితురాలే తప్ప నిందితురాలు కాదని అన్నారు. న్యాయవ్యవస్థపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ధర్మం తప్పకుండా గెలుస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా ఈ కేసును బయటకు వస్తారని అన్నారు.

## వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి..

**ప్రతి బండి నెంబర్ నమోదు చేయాలి**

**పోలింగ్ కేంద్రాల్లో వసతులు సమకూర్చండి : కలెక్టర్ వీపీ గౌతమ్**


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఏసీపీ తిరుపతిరెడ్డి

కూసుమంచి, మార్చి 22 : జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును, పెరికసింగారం, జుర్రుల్‌రావుపేట, నాయకన్‌గూడెం, ఈశ్వరమాధారం, రాజుపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డిని.. రిజిస్టర్ మెయింటెనెన్స్, వాహన తనిఖీలు ఎలా చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం నెంబర్‌ను నమోదు చేయాలని, వీడియోలు తీస్తూ 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన**

పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్, తాగునీరు, మిషన్ భగీరథ నీరు రాని కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఓటరు జాబితాను తనిఖీ చేసి.. బీఎల్‌వోల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు తెలిసే విధంగా వాల్ పెయింటింగ్ వేయించి పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పోలింగ్ సమయంలో గతంలో ఏమైనా ఇబ్బందులు కలిగాయా? అనే విషయాలను అధికారులు, ఉపాధ్యాయులు, ఎస్సై కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాలేరు రిటర్నింగ్ అధికారి ఆర్.రాజేశ్వరి, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, తహసీల్దార్ సురేశ్, ఏవో వాణి, ఉద్యానవన అధికారి అపర్ణ, ఎస్సై కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీపీఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి జెన్కో క్రీడలు


విజేత జట్టుతో కేటీపీఎస్ సీఈలు

పాల్వంచ, మార్చి 22: పాల్వంచ కేటీపీఎస్‌లోని ఏడో దశ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్స్ వాలీబాల్, లాన్ టెన్నిస్ క్రీడలు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్‌లో కేటీపీపీ (భూపాలపల్లి) జట్టు మొదటి స్థానం, కేటీపీఎస్ 5, 6 దశల జట్టు రెండో స్థానం, కేటీపీఎస్ ఏడో దశ జట్టు మూడో స్థానం, బీటీపీఎస్ మణుగూరు జట్టు నాలుగో స్థానం సాధించాయి. టెన్నిస్‌లో టీమ్ ఈవెంట్‌లో కేటీపీఎస్ ఏడో దశ మొదటి స్థానం, కేటీపీఎస్ 5, 6 దశలు రెండో స్థానం, కేటీపీపీ భూపాలపల్లి మూడో స్థానం, బీటీపీసీ మణుగూరు నాలుగో స్థానంలో నిలిచాయి. సింగిల్స్‌లో కే.సతీశ్ (కేటీపీఎస్ 5, 6 దశలు) మొదటి స్థానం, ఎండీ ఆరీఫ్ (కేటీపీఎస్ ఏడో దశ) 2వ స్థానం, ఎస్కే సోందు (వైటీపీఎస్) మూడో స్థానం, డబుల్స్‌లో వై.వెంకటేశ్వర్లు, ఆరీఫ్‌లు మొదటి స్థానం, సతీశ్, జీ.వెంకటేశ్వర్లు రెండో స్థానం, సోందు, అయోధ్యలు మూడో స్థానంలో నిలిచారు. విజయం సాధించిన జట్లకు, క్రీడాకారులకు కేటీపీఎస్ ఏడో దశ సీఈ వెంకటేశ్వరరావు, 5, 6 దశల సీఈ ప్రభాకర్ రావు, శ్రీనివాసరాజులు బహుమతులు ప్రదానం చేశారు.

## చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

**ఐదేళ్లలోపు పిల్లల మరణాల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: డీఎంహెచ్‌వో**

కొత్తగూడెం టౌన్, మార్చి 22: చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల మరణాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెంలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన డిస్ట్రిక్ట్ చైల్డ్ డెత్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే వ్యాధుల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఐదేళ్లలోపు పిల్లల మరణాలు, కారణాల గురించి చర్చించారు. మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ కోరశ్రీ యాదవ్, డాక్టర్ పుష్పలత, డాక్టర్ వీరబాబు, డాక్టర్ వెంకన్న, డాక్టర్ బాలాజీ, సీహెచ్‌వో నాగభూషణం, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శిరీష

## హామీలన్నీ అమలుచేసేదాకా వదలం

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరుటౌన్, మార్చి 22 : అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేదిలేదని, ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణభవన్(బీఆర్ఎస్ కార్యాలయం)లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో 13 అంశాలను పొందుపరిచి వందరోజుల్లోనే అమలుచేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వందరోజులు గడిచినా హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంటుపోయిన దాఖలాలు లేవని, రైతుల ఖాతాల్లో టింగు టింగుమంటూ రైతుబంధు జమ అయ్యేదని, ప్రతినెలా ఆసరా పెన్షన్లు అందాయని, సాగునీరు సమృద్ధిగా ఉండి రైతులు రెండు పంటలు పండించుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు ఆగిపోయిందని, సాగునీరు లేక రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పురోగమనంలో పయనిస్తున్న రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎప్పుడు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. సమావేశంలో మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యం బాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తికి యాంత్రికశక్తి అవసరం

**సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి**


వీల్‌లోడర్‌ను ప్రారంభిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్, మార్చి 22 : బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు శ్రామిక శక్తితోపాటు యాంత్రికశక్తి ఎంతో అవసరమని సింగరేణి సంస్థ డైరెక్టర్(పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు పీకేఓసీ-2 గనిలో రూ.4.5కోట్ల విలువైన 6.4 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంగల అత్యాధునిక వీల్‌లోడర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యాధునిక యంత్రాలను వినియోగించుకుంటూ మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 119.5 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. ఓసీ-2 గని కార్మికులు, అధికారులు, యూనియన్ల నాయకులు, కాంట్రాక్టు కార్మికులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఏరియా ఇంజినీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్టు అధికారి(పీకేఓసీ-2) లక్ష్మీపతిగౌడ్, ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, ప్రాజెక్టు ఇంజినీర్ వీరభద్రుడు, అధికారులు రమణారెడ్డి, లింగబాబు, అబ్దుల్‌షబ్బీరుద్దీన్, చిట్టా శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు వై.రాంగోపాల్, కృష్ణంరాజు, కార్మికులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సమీక్ష

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 22 : పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన ఏర్పాట్లపై డీఈవో సోమశేఖర శర్మ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎంపిక చేసిన పాఠశాలల హెచ్ఎంలతో జూమ్ మీటింగ్‌లో ఆయన పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అమ్మ ఆదర్శ కమిటీలతో సమావేశం నిర్వహించి అవసరమయ్యే పనులపై తీర్మానం చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన 665 పాఠశాలలకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాలలకు రూ.25 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.లక్ష చొప్పున డబ్బులు జమ చేశామని పేర్కొన్నారు. నగదు జమ కాని పాఠశాలల హెచ్ఎంలు తనను సంప్రదించాలని డీఈవో కోరారు.


హెచ్ఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న డీఈవో సోమశేఖర శర్మ

## ఆరుతడి పంటలతోనే ఆదాయం

**ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ గోవర్ధన్**



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ గోవర్ధన్

చింతకాని, మార్చి 22 : రైతులు యాసంగి సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసి అధిక ఆదాయం పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్టలు ఎం.గోవర్ధన్, ఆర్.ఉమారెడ్డి అన్నారు. రామకృష్ణాపురంలో క్లస్టర్ రైతులకు యాసంగిలో వరికి బదులుగా వేయాల్సిన ఆరుతడి పంటలు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం ఒక రోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంది, మినుములు, పెసలు తదితర పంటలను వేసి వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ లాభాలు గడించాలన్నారు. యాసంగి ఆరంభంలో పొలాల్లో చెత్తను తగులబెట్టడం వల్ల భూసారం దెబ్బతింటుందని, పై పంటలు వేయడం వల్ల పొలాల్లో నత్రజని పోషకాలు పుష్కలంగా నిల్వ అవుతాయని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి నిస్సారం అవుతుందని, ఇందుకోసం రైతులు సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. అనంతరం జీరో టిల్లేజ్ పద్ధతి ద్వారా మక్క సాగుపై క్షేత్ర పరిశీలన చేసిన శాస్త్రవేత్తలు సాగు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయ నిర్మల, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ప్రగతికుమార్, శైలజ, కిరణ్‌రెడ్డి, భరత్, నాగస్వాతి, చిరంజీవి, రాణా, రవికుమార్, పల్లెల నాగయ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఎదుగుదల లేని వరి పంట పరిశీలన

**నమూనాలు సేకరించిన కేవీకే శాస్త్రవేత్త, ఏడీఏ**


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

ఇల్లెందు రూరల్, మార్చి 22 : కొమరారం గ్రామంలో కొందరు రైతులు వేసిన వరి పంట ఎదుగుదల లేకపోవడం, 15 రోజులకే కంకి రావడంతో ఇటీవల రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రైతుల ఫిర్యాదు మేరకు కృషి విజ్ఞానం కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఏడీఏ రవికుమార్‌లు శుక్రవారం భూక్యా వీరన్న, వాంకుడోత్ హచ్చు, వాంకుడోత్ శంకర్, బానోత్ బాలు తదితర రైతులు వేసిన వరి పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు జెనెక్స్, ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాలు వేశారని, అవన్నీ ధ్రువీకరణ లేని విత్తనాలని అన్నారు. ఎకరానికి 10 కేజీల చొప్పున జనవరి మొదటి వారంలో నారు పోసి.. ఫిబ్రవరి మొదటి వారంలో నాటు వేశారని తెలిపారు. మొక్క ఎత్తు, పిలకల సంఖ్య, కంకి పొడవును సేకరించడంతోపాటు ఎన్ని కిలోల విత్తనాలు వేశారు? ఏయే పురుగు మందులు వాడారు? అనే వివరాలను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ వాసవీరాణి, ఏవో సతీశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.